
సాక్షి పార్వతీపురం మన్యం

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



తీరిన గిరిజనుల 'వే'దన

మంచి చేయాలనే సదుద్దేశం. గిరిజనుల రహదారి కష్టాలను తొలగించాలనే చిత్తశుద్ధి ఉంటే రహదారి నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులనైనా అధిగమించగలమని వైఎస్సార్‌సీపీ పాలనలో రుజువు చేసింది. - 8లో



ఆర్టీసీ డ్రైవర్‌కు వడదెబ్బ

శ్రీకాకుళం డిపో పల్లెవెలుగు బస్సు భామిని మండలంలోని బాలేరు–దిమ్మిడిజోల గ్రామాల మధ్య ఏజీ రోడ్డు పక్కగా ఒరిగిపోయింది. - 8లో



రిసెప్షన్ సెంటర్ల వద్ద పక్కా ఏర్పాట్లు

రిసెప్షన్ సెంటర్ల వద్ద అన్ని వసతులను కల్పిస్తూ, పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను ఆర్డీఓ, పార్వతీపురం నియోజకవర్గం ఎన్నికల అధికారి హేమలత ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈవీఎంల భద్రతకు చేపట్టాల్సిన చర్యల గురించి సిబ్బందిని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లలో సీసీకెమెరాల ఏర్పాట్లపై తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వహించాలని సిబ్బందికి స్పష్టం చేశారు.

ఏఓబీ భద్రత కీలకం



పార్వతీపురంటౌన్: చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ ఆనందరావు

పార్వతీపురంటౌన్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు (ఏఓబీ) గ్రామాల్లో భద్రత కీలకమని తహసీల్దార్ కె.ఆనందరా వు అన్నారు. పార్వతీపురం మండలం ఆర్కే బట్టివలస చెక్‌పోస్టును ఆదివారం ఆయన తనిఖీ చేశారు. అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో భద్రత ఎంతో కీలకమన్నారు. పక్కనే ఉన్న ఒడిశా నుంచి గంజా యి, సారా, మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెట్టాలని, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయా లని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవర కు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రామకృష్ణ ఉన్నారు.

● **బలిజిపేటలో..**



బలిజిపేట: సంతతోట వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై పాపారావు, సిబ్బంది

బలిజిపేట: మండలంలోని వెంగాపురం సంతతోట సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్సై పాపారావు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ రోడ్డులో వచ్చిపోయే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మద్యం, నగదు, ఇతర సామగ్రి తరలింపుపై నిఘా పెట్టినట్టు చెప్పారు. సరైన ధ్రువపత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు, ఇతర సామగ్రి తరలిస్తూ పట్టుపడితే వాటిని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

● **మక్కువలో..**



మక్కువ: వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

మండల కేంద్రంలోని మూడురోడ్ల కూడలి, స్థానిక మజ్జిగౌరమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టల వద్ద ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మక్కువ నుంచి దుగ్గేరు, శంబర గ్రామాలతో పాటు, సాలూ రు, పార్వతీపురం పట్టణాల వైపు రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను నిలుపుదల చేసి ప్రయాణికుల లగేజీని పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, సారా వంటివి తరలింపుపై నిఘా పెట్టినట్టు చెప్పారు.

జగన్ మామ చలవే..!

● పేదపిల్లల భవితకు జగనన్న విద్యా 'కానుక'
● ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం
● తల్లిదండ్రులకు తగ్గిన ఆర్థికభారం
● జిల్లాలో ఏటా 96 వేలమందికి పైగా లబ్ధి
● నాలుగేళ్లలో 3,86,977 మందికి రూ.72.84 కోట్ల ఖర్చు

నాకు బట్టలు, పుస్తకాలు లేవు..బ్యాగులేదు..నేను బడికెళ్లనూ..ఇంట్లోనే ఉంటానూ..ఆడుకుంటానూ..అంటూ ఒకప్పుడు మారాం చేసే పేదపిల్లలు..తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోపగించుకునే సరికి చిరిగిన చొక్కాలు, జారుతున్న లాగులను సరిచేసుకుంటూ..అట్టలు చిరిగిపోయిన పుస్తకాలను మాసిన సంచిలో చంకన వేసుకుని బడులకు వెళ్లే నాటి రోజులు పోయాయి. టక్కూ, టై..బూటు, బెల్టుతో దర్జాగా పాఠశాలకు ఆసక్తిగా వెళ్తున్న పరిస్థితి కనిపిస్తోంది. మిలమిలా మెరిసే బ్యాగును వెనుక తగిలించుకుని కార్పొరేట్ విద్యార్థి మాదిరి పాఠశాలకు దర్జాగా వెళ్లే రోజులు వచ్చాయి. ఈ మార్పంతా ఎవరి వల్ల వచ్చిందని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలను అడిగితే టక్కున వారు చెప్పే పేరు జగన్ మామయ్య వల్లనేనని.



కలెక్టర్ నిషాంత్‌కుమార్ చేతుల మీదుగా జగనన్న విద్యాకానుక కిట్ అందుకుంటున్న విద్యార్థిని (ఫైల్)



ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాంతో కురుపాంలోని కేజీబీవీలో చదువుతున్న విద్యార్థినులు

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం టౌన్:

పేదపిల్లలకు తాను ఇచ్చే ఆస్తి చదువే అని ప్రతి సందర్భంలోనూ గర్వంగా చెబుతూ..నాడు–నేడు కార్యక్రమం అమలు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు బహుమతిగా 'జగనన్న విద్యాకానుక'ను ఏటా విద్యాసంవత్సరం ఆరం భంలో అందిస్తున్నారు. విద్యార్థుల చదువుకు అవసరమయ్యే వస్తువులన్నింటినీ కిట్ల రూపంలో సమకూరుస్తున్నారు.

జిల్లాలో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ ఇలా

విద్యా సంవత్సరం	లబ్ధి పొందిన విద్యార్థులు	కిట్లకు అయిన ఖర్చు(రూ.కోట్లలో)
2020–21	95,326	రూ. 18.11
2021–22	96,287	రూ. 18.16
2022–23	98,682	రూ. 18.37
2023–24	96,682	రూ. 18.20

చదువు భారాన్ని తగ్గించి..

గతంలో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులే చక్కని యూనిఫాం, బూట్లతో చక్కగా తయారై వెళ్లేవారు. జగనన్న ప్రభుత్వంలో ప్రైవేట్ స్కూల్స్‌కు దీటుగా విద్యార్థులు వెళ్తున్నారు. జగనన్న విద్యాకానుకతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేలాది పేద కుటుంబాలకు చదువు ఖర్చు భారాన్ని తగ్గించారు. పిల్లలు, తల్లిదండ్రుల్లోనూ ప్రభుత్వ బడుల పట్ల ఉండే చిన్నచూపును పోగొట్టారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్, వసతిగృహాలు..ఇలా అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లోనూ విద్యార్థులందరికీ ఈ ప్రభుత్వం యూనిఫాం దుస్తులను అందజేస్తోంది.

నాడు చంద్రబాబు హయాంలో డ్రాపౌట్లు..

టీడీపీ హయాంలో ప్రైవేట్ స్కూల్స్‌తో పాటు..ప్రభుత్వ బడుల్లోనూ చదువుకునే పరిస్థితి లేక డ్రాపౌట్ల సంఖ్య పెరిగేది. నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ పరిస్థితిని పూర్తిగా మార్చింది. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, నాడు–నేడు వంటి పథకాలు అమలు చేస్తూ విద్యార్జన కోసం బడుగు, బలహీన వర్గాల పిల్లలు ఎవరిపైనా ఆధారపడకుండా..వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపకుండా..పెన్ను, పుస్తకాల కోసం ఎదురు చూడకుండా విద్య, అందుకు అవసరమైన ఉపకరణాలన్నీ ప్రభుత్వం నుంచే తమ హక్కుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పొందుతున్నారు. ఇది వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. చంద్రబాబు హయాంలో ఒకరిపై ఆధారపడుతూ ఆత్మన్యూనతకు గురయ్యే దుస్థితి నుంచి..నేడు స్థిరమైన ఆత్మవిశ్వాసం పొందుతున్నారు. ఇదీ..జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యం.

కిట్‌లో తొమ్మిది రకాల వస్తువులు..

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకూ చదివే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లలో ఒక ఏడాదికి సరిపోయేలా మూడు జతల యూనిఫాం దుస్తులు(క్లాత్), బూట్లు, రెండు జతల సాక్సులను ప్రభుత్వం ఇస్తోంది. దీంతోపాటు బెల్టు, ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీ, స్కూల్ బ్యాగ్..ఇలా తొమ్మిది రకాల వస్తువులను పాఠశాలలు తెరిచేరోజునే అందజేస్తున్నారు. యూనిఫాం కుట్టించుకునేందుకు మూడు జతలకు రూ.120 చొప్పున తల్లుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేస్తున్నారు. కరోనా సమయంలో మాస్కులను కూడా పంపిణీ చేశారు. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు బొమ్మలతో కూడిన పిక్టోరియల్..ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను అందజేశారు. 2023–24 విద్యాసంవత్సరంలో 96,681 విద్యార్థులకు జిల్లాలో జేవీకే కిట్లను అందజేశారు. గడిచిన నాలుగేళ్లలో 3,86,977 మంది విద్యార్థులు లబ్ధి పొందారు. ఇందుకోసం ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.72.84 కోట్లు.

ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు వరం



విద్యార్థులు పాఠశాలకు వచ్చిన తొలిరోజునే జగనన్న విద్యా కానుక అందించేవారు. పుస్తకాలతో పాటు, మంచి దుస్తులు, బూట్లు మా పిల్లలకు ఇచ్చేవారు. అవి పిల్లలకు చాలా ఉపయోగపడ్డాయి. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే పిల్లల మాదిరి చక్కగా తయారై వెళ్లేవారు. గతంలో కంటే ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు ఇప్పుడు బాగా మెరుగుపడ్డాయి.

–లక్ష్మి, విద్యార్థి తల్లి, బీసీ కాలనీ, బలిజిపేట

భర్త కళ్లెదుటే భార్య మృతి

● లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు
● భార్యను కాపాడండంటూ భర్త ఆర్తనాదాలు



అనూరాధ (ఫైల్)



ఘటనాస్థలంలో అనూరాధను రక్షించేందుకు యత్నిస్తున్న స్థానికులు

పాలకొండ రూరల్: కళ్లముందే భార్య అచేతన స్థితిలోకి వెళ్లిపోతుండడంతో ఆ ఉద్వేగ క్షణాల్లో ఎవరైనా..నా భార్యను కాపాడండంటూ చేసిన భర్త చేసిన ఆర్తనాదాలు మిన్నంటాయి. ఈ విషాద సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలంలోని విక్రాంపురం గ్రామానికి చెందిన బోటు శ్రీనివాసరావు, భార్య అనూరాధ(41)లు వారి పెద్ద కుమార్తె సీమంతంఫంక్షన్‌కు బంధువులను పిలిచేందుకు బైక్‌పై ఆదివారం సరుబుజ్జిలి పయనమయ్యారు. కుటుంబంలో జరగనున్న శుభకార్యం గురించి ముచ్చటించుకుంటూ వెళ్తున్న భార్యాభర్తలను చూసిన విధికి కళ్లు కుట్టాయి. లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చి పాలకొండ పట్టణంలోని పాత ఆంధ్రా బ్యాంకు సమీపంలో వారి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడిపోయారు. కాసేపటికి తేరుకుని భర్త చూసేసరికి ముఖంపై తీవ్రగాయమైన భార్య అచేతన స్థితిలోకి జారుకుంది. ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కళ్ల ముందే కట్టుకున్న భార్య ప్రాణం విడవడంతో భర్త శ్రీనివాసరావు రోదన చూపరులను కంటతడి పెట్టించింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్సై ఎస్.ప్రశాంతకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్నకు తోడుంటాం

● టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 100 కుటుంబాలు
● సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే జోగారావు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తోడుగా ఉంటామని సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ టీడీపీకి చెందిన 100 కుటుంబాల వారు ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. మండలంలోని బూర్జలో జెడ్పీ మాజీ చైర్మన్ వి.నాగేశ్వరరావు నివాసంలో జరిగిన వైఎస్సార్‌సీపీలో చేరికల కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు వారందరికీ పార్టీకండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో ఉన్న బడుగు బలహీన వర్గాలకు చెందిన జి.సత్యంనాయుడు, బి.వెంకటినాయుడు, టి వెంకటినాయుడు, ఇ.సత్యంనాయుడు, ఎ.జగ్గునాయుడు, ఎ. చిట్టినాయుడు, జి తిరుపతి గోవిందరావులతో పాటు 100 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ టీడీపీలో కుమ్ములాటలు, పెరుగుతున్న నియంతృత్వ ధోరణితో ఇబ్బందులు పడుతున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా జగనన్న ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని ఈ మేరకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.దాసు, ఎంపీటీసీ జి.చిన్నంనాయుడు, మాజీ ఎంపీటీసీ టి.సూరప్పనాయుడు, వైస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్వితీయ విజయం తథ్యం

● వైఎస్సార్‌సీపీపై అంతులేని ప్రజాభిమానం
● వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు



ఇంటర్వ్యూ

తమ ప్రభుత్వం హయాంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలు పార్వతీపురం నియోజకవర్గ ప్రజలకు సంతృప్తి కలగడంతో అంతులేని అభిమానం చూపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు అన్నారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొంది నిత్యం ప్రజలతో మమేకమై ప్రజాసమస్యలు పరిష్కరించడంలోనే తాను ఉన్నానని చెబుతున్నారు. సంపూర్ణ గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాల ఫలి తాలే తాను రెండవసారి ఎమ్మెల్యేగా అద్భుతమైన విజయం సాధించేందుకు దోహదపడతాయని ధీమాగా చెబుతున్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన "సాక్షి"తో పంచుకున్న విశేషాలిలా ఉన్నాయి.

-పార్వతీపురం టౌన్

సాక్షి: నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ ప్రభుతంలో చేకూరిన లబ్ధి..?

జవాబు: పార్వతీపురం నియోజకవర్గంలో 3 మండలాలు, 1 మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇచ్చాం. విద్య, వైద్య రంగంలో దశాబ్దాలనాటి సమస్యలు పరిష్కరించాం. డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా రూ.1540 కోట్లను నియోజకవర్గంలో ప్రజలకు అందజేశాం. పథకాల ద్వారా 1.84 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి చేకూరింది.

సాక్షి: నియోజకవర్గంలో దశాబ్దాల నాటి సమస్యలు పరిష్కరించారా..?

జవాబు: సీతానగరం మండలంలోని గెడ్డలుప్పి వద్ద 2009లో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారు. అప్పటినుంచి గత ప్రభుత్వాలలో జరగని పనిని మా ప్రభుత్వ హయాంలో పూర్తి చేశాం. సువర్ణముఖి నదిపై గెడ్డలుప్పి–బగ్గన్నదొరవలస గ్రామాల మధ్య రూ.12కోట్లతో వంతెన, అలాగే బలిజిపేట మండలంలోని నారాయణపురం వద్ద సువర్ణముఖి నదిపై నారాయణపురం–గౌరీపురం గ్రామాల మధ్య వంతెన నిర్మించాం. సీతానగరం మండలంలోని బూర్జలో 40సంవత్సరాల కలను సాకారం చేస్తూ బూర్జ–చినఅంకలాం వంతెన కోసం రూ.10కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాం. పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి వద్ద సాకిగెడ్డ మీద వంతెన నిర్మాణం పూర్తి చేశాం.

సాక్షి: నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి ఏంటి..?

జవాబు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి రహదారుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇనిచ్చారు. నియోజకవర్గంలోని బలిజిపేట మండలంలో 13, సీతానగరం మండలంలో 11, పార్వతీపురం మండలంలో 15 బీటీ రోడ్లు పూర్తి చేశాం. పార్వతీపురం బైపాస్ రోడ్డు పూర్తయింది. ఇంకా పార్వతీపురం నుంచి బొబ్బిలివరకు ఎన్‌హెచ్16(25కిలోమీటర్లు) రోడ్డు నిర్మాణం పూర్తి చేశాం.

సాక్షి: 2024 ఎన్నికల్లో విజయానికి ఇస్తున్న హామీ ఏంటి..?

జవాబు: పార్వతీపురం పట్టణంలోని డంపింగ్ యార్డ్ సమస్యకు 6 నెలల్లో పరిష్కారం చూపిస్తాం. ఈ సమస్య గురించి సంబంధిత మంత్రి, సీఎంఓ అధికారులతో మాట్లాడాను. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతాం. యువతను పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు శిక్షణ కేంద్రాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు అండగా ఉంటాం.

సాక్షి: పార్వతీపురానికి మేజర్ ప్రాజెక్టులు తీసుకువచ్చారా..?

జవాబు: గిరిజన ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లాకు సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ నిర్మాణానికి సంబంధించి సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టిలో పెట్టగానే రూ.49.56 కోట్లు మంజూరు చేశారు. పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు రూ.600కోట్లు మంజూరు చేశారు. పార్వతీపురం పట్టణ ప్రధాన సమస్య తాగునీరు సరఫరా కోసం 63కోట్లు మంజూరు చేయగా పనులు జరుగుతున్నాయి. రూ.300 కోట్లతో నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటికీ కుళాయిలు వేసి తాగునీటి సమస్య పరిష్కరించాం.

సాక్షి: ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది..?


జవాబు: ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాం. ఒక రోజులో పార్వతీపురం పట్టణంలోను, ఏదైనా ఒక మండలంలో ప్రచారం చేస్తున్నాం. అడుగడుగునా ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా వైఎస్సార్‌సీపీపై అభిమానంతో ప్రజలు స్వచ్ఛందంగా మాతో కలిసి ప్రచారంలో పాల్గొంటున్నారు.

సీఎం సిద్ధం సభ ఏర్పాట్ల పరిశీలన



నాయకులకు సూచనలిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23న జిల్లాకు తొలిసారి విచ్చేస్తున్న సందర్భంగా విజయనగరం మండలం చెల్లూరు వద్ద నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ డిప్యూటీ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి బస్సుయాత్రలో భాగంగా జిల్లా కేంద్రం సమీపం చెల్లూరు వద్ద మేమంతా సిద్ధం భారీ బహిరంగ సభను మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో సభా స్థలం వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.



పాచిపెంట: పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

మోసూరులో 35 కుటుంబాలు

పాచిపెంట: మండలంలోని మోసూరు గ్రామంలో 35 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. మాజీ వైస్ ఎంపీపీ గండిపల్లి రాము ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన నక్కాన నచ్చన్న, దాలయ్య, త్రినాథ, పిల్లల పోలయ్య, కొన్రు కోటి, ఆదినారాయణ, అప్పలనాయుడు, పిట్టా రాముతో పాటు మరో 35 కుటుంబాలకు చెందిన వారంతా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి డిప్యూటీ సీఎం, సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవీంద్ర, సాలూరు మండల వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, స్థానిక ఎంపీటీసీ కొల్లి కొత్తయ్య, యువజన విభాగం నాయకులు శనాపతి నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర స్పోక్స్‌పర్సన్‌గా రేగాన


రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట గ్రామానికి చెందిన రేగాన శ్రీనివాసరావుకు వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర విభాగంలో చోటు దక్కింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రేగాన శ్రీనును వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా నియమిస్తూ ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తనను నియమించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం జగనన్నతోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమైందన్నారు. ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలతో ఎస్సీలు ఆత్మ గౌరవంతో జీవిస్తున్నారన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర పదవిని కట్టబెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, సహకరించిన జిల్లా ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తానని స్పష్టం చేశారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి..


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి, డాక్టర్ అజయ్

బాడంగి: మండలంలోని పిండ్రంగివలస శివారు గ్రామమైన రౌతువానివలసకు చెందిన టీడీపీ కార్యకర్తలు పలువురు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం ఆ గ్రామానికి వెళ్లినప్పుడు ఆయన సమక్షంలో వారు పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. గ్రామ సర్పంచ్ రావాడ గౌరమ్మ, భర్త తిరుపతిరావు ఆధ్వర్యంలో వీరు చేరారు. డాక్టర్ పోల అజయ్, జిల్లా జేసీఎస్ కన్వీనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జామిలో...


ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కుద్దుపాలెం గ్రామస్తులు

జామి: మండలంలోని అలమండ పంచాయతీ కుద్దిపాలెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో ఆదివారం చేరారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కుద్దిపాలెం గ్రామంలో వారందరికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. యలమంచిలి దేముడు, కోన సురేష్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, మాజీ ఎంపీపీ కాకర్లపూడి సూరిబాబురాజు, ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, ఉప సర్పంచ్ లగుడు దేముడు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి బీఎస్పీ నాయకుడు


బీఎస్పీ ఎస్.కోట నియోజకవర్గం ఉపాధ్యక్షుడు చైతన్యకుమార్‌కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: బహుజన సమాజ్‌వాది పార్టీ శృంగవరపుకోట నియోజకవర్గం ఉపాధ్యక్షుడు గాలి చైతన్యకుమార్ తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. కొత్తవలస మండలం అర్థన్నపాలెం గ్రామ సమీపంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చైతన్యకుమార్‌కు పార్టీ కండువా వేసి కడుబండి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు మేలు జరుగుతోందని, అందుకే పార్టీలో చేరినట్టు ఆయన తెలిపారు. జామి మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్ పాల్గొన్నారు.

మద్యం సీసాల సీజ్

గజపతినగరం: మండలంలోని లోగిశ గ్రామానికి చెందిన బొత్స చక్రి మద్యం సీసాలను తరలిస్తుండగా గజపతినగరం చంపావతి నది బ్రిడ్జి వద్ద ఆయనను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ యు.మహేష్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. బొత్స చక్రి మద్యం వ్యాపారం నిమిత్తం 12 మద్యం సీసాలను గజపతినగరం నుంచి లోగిశ గ్రామానికి తరలిస్తుండగా ఆయనను అదుపులోకి తీసుకొని మద్యం సీసాలను సీజ్ చేసి ఆదివారం రాత్రి కేసును నమోదు చేసినట్లు చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹240

● అలుపెరగని ప్రచారం

పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎండలు మండుతున్నా విరామమెరగకుండా ప్రజల్లోకి వెళ్తూ తమ ప్రభుత్వం హయాంలో ప్రజలకు అందజేసిన సంక్షేమ ఫలాలు, అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి ఆయా నియోజకవర్గాల్లోని ప్రజలు మద్దతు పలుకుతున్నారు. స్వచ్ఛందంగా అభ్యర్థుల వెంట ప్రచారంలో వారు కూడా పాల్గొంటున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, పార్టీ స్థానిక నాయకుల సహకారంతో అభ్యర్థులు అలుపెరగని ఉత్సాహంతో ప్రచారంలో మెరుస్తున్నారు.


వీరఘట్టం మండలంలోని అదారులో ర్యాలీగా వస్తూ ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థిని కళావతి


పార్వతీపురం పట్టణంలోని 5వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు


సాలూరు పట్టణంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

తీరిన గిరిజనుల 'వే'దన

- కోట్లాది రుపాయలతో రోడ్ల నిర్మాణం
- మైదాన, గిరిశిఖర గ్రామాలకు బీటీ రోడ్లు పూర్తి
- ముమ్మరంగా సాగుతున్న మరికొన్ని రోడ్ల పనులు


అటవీమార్గం గుండా వేసిన గిరిశిఖర కరాడవలస రోడ్డు


నిర్మాణం పూర్తయిన ఎన్‌హెచ్26 నుంచి కరాడవలస రోడ్డు


శిఖపరువు రోడ్డు


రొడ్డవలస రోడ్డు

సాలూరు: దేశంలో దుర్భేద్యమైన గిరిశిఖర గ్రామాలకు రోడ్డు నిర్మాణం దాదాపు అసాధ్యమనే వాదన గత టీడీపీ పాలనలో వినిపించేది. మంచి చేయాలనే సదుద్దేశం, గిరిజనుల రహదారి కష్టాలను తొలగించాలనే చిత్తశుద్ధి ఉంటే రహదారి నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులనైనా అధిగమించగలమని వైఎస్సార్‌సీపీ పాలనలో రుజువు చేసింది. ఒక్క పీఆర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలోనే సుమారు వంద కోట్ల రుపాయలతో గిరిశిఖర ప్రాంతాలతో పాటు మైదాన ప్రాంతాల్లోను అనేక గ్రామాలకు రోడ్లు మంజూరు చేసి, పనులు చేపట్టింది.

గిరిశిఖర గ్రామాల రోడ్ల ప్రగతి వివరాలు

ఎన్‌హెచ్26 నుంచి కరాడవలసకు రూ.496.90 లక్షలతో 7.30 కి.మీ రోడ్డు పూర్తయింది.

- సాలూరు మండలంలోని గంజాయిభద్ర పంచాయతీ దిగువశెంబి నుంచి డిప్పలపాడు మీదుగా తోణాం గ్రామానికి రూ.620 లక్షలతో 6 కి.మీ. రోడ్డు పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- పాచిపెంట మండలంలోని ఆజూరు నుంచి పందిరిమామిడివలసకు సుమారు రూ.224లక్షలతో 3.80 కి.మీ.రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు.
- ఇదే మండలంలో కుంతాం బీటీ రోడ్డు నుంచి తుమ్మిగుడ్డకు రూ.465 లక్షలతో 6.90 కి.మీ., నీలంవలస నుంచి గుమ్మిడిగుడకు 376.50 లక్షల రుపాయలతో 6.80 కి.మీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రారంభోత్సవం చేశారు. అలాగే వేటగానివలస నుంచి శతాబి మీదుగా అరకుకు రూ.997 లక్షలతో 14 కి.మీ. రోడ్డు నిర్మాణానికి గాను 8 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయింది.
- రూ.628 లక్షలతో వేటగానివలస నుంచి తంగ్లాం గ్రామానికి రోడ్డు పనులు జరుగుతున్నాయి. అలాగే రూ.618 లక్షలతో వేటగానివలస తంగ్లాం రోడ్డు నుంచి మూటకూడు గ్రామానికి రోడ్డుపనులు జరుగుతున్నాయి.
- రొడ్డవలస నుంచి కంకణాపల్లికి రూ.135 లక్షలతో ప్రారంభించిన 1.20 కి.మీ.రోడ్డు నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఇంకా రూ.403 లక్షల అంచనా వ్యయంతో పాచిపెంట మండలం ఆలూరు నుంచి మోదుగకు చేపట్టిన రహదారి నిర్మాణం వివిధ దశల్లో ఉంది.
- సాలూరు మండలం నంద–పగులుచెన్నేరు నుంచి కొదమకు సుమారు రూ.1132.56 లక్షలతో 10.80 కి.మీ రోడ్డుకు 2022 ఆగస్టు 26న, ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నిషాంత్‌కుమార్ భూమి పూజ చేయగా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

రిసెప్షన్ సెంటర్ల వద్ద పక్కా ఏర్పాట్లు

- పటిష్టంగా స్ట్రాంగ్ రూమ్‌లను రూపొందించాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి
- లెండీ, జేఎన్‌టీయూ కళాశాలలను పరిశీలించిన కలెక్టర్


జేఎన్‌టీయూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: రిసెప్షన్ సెంటర్ల వద్ద అన్ని వసతులను కల్పిస్తూ, పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం ఉదయం జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయం, డెంకాడ మండలంలోని లెండీ ఇంజినీరింగ్ కళాశాలలను ఆమె సందర్శించారు. వాహనాల పార్కింగ్ కోసం పరిసర ప్రాంతాలను సైతం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగురూములు, బారికేడింగ్, పార్కింగ్, భోజన ఏర్పాట్లుపై సమీక్షించారు. లెండి కళాశాలలో రాజాం, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల, శృంగవరపుకోట నియోజకవర్గాలు, జేఎన్‌టీయూజీవీలో బొబ్బిలి, విజయనగరం నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిసెప్షన్ సెంటర్ సిబ్బందితో పాటు, పోలింగ్ అనంతరం ఈవీఎంలను తీసుకువచ్చే అధికారులు, సిబ్బంది రాకపోకలకు ఎక్కడా ఇబ్బంది పడకుండా కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటర్లు తగినంత విశాలంగా, పూర్తి లైటింగ్‌తో ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంలను తీసుకురావడానికి, స్ట్రాంగురూములోకి తరలించడానికి, అవసరమైన పత్రాలను నింపేందుకు, అందజేసేందుకు వీలుగా కౌంటర్లు ఉండాలన్నారు. బస్సులు, అధికారుల వాహనాలు లోపలికి రావడానికి, సిబ్బందిని దించి బయటకు వెళ్లడానికి వీలుగా రెండు వేర్వేరు మార్గాలను ఏర్పాటు చేయాలని, ఎక్కడా ట్రాఫిక్ జామ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల్లో స్పెషల్ కౌంటర్లు, ఆర్‌ఓ టేబుల్, హెల్ప్ డెస్క్, స్క్రూటినీ, మైక్రో అబ్జర్వర్స్ కోసం కూడా కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. మంచిగా భోజన సదుపాయాన్ని కల్పించాలని ఆదేశించారు. సిబ్బంది ఈవీఎంలతో లోపలికి వచ్చిన దగ్గరనుంచి, తమకు కేటాయించబడ్డ కౌంటర్లకు సులువుగా చేరుకొనేవిధంగా, గుర్తించే విధంగా నేమ్ బోర్డులు, డైరెక్షన్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యాన్ని ప్రతీచోటా కల్పించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఈవీఎంల స్ట్రాంగ్ రూములను సిద్ధం చేయాలని, పనులు వెంటనే మొదలు పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎంవీ సూర్యకళ, ఆయా కేంద్రాల నోడల్ అధికారులైన మెప్మా పీడీ ఎం.సుధాకరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, డీఎస్‌ఓ మధుసూదనరావు, సివిల్ సప్లయిస్ డీఎం మీనా కుమారి, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ పేరుతో మాయ!

శృంగవరపుకోట:

వ్యవసాయం దండగంటూ వ్యాఖ్యలు చేసినా.. అందరికీ అన్నంపెట్టే రైతన్నంటే చిన్న చూపుచూసినా.. ఉచిత విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు పెట్టినా.. 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో రైతుల రుణాలు మాఫీ చేస్తానంటే టీడీపీ అధినేత చంద్రబాబును నమ్మారు. రుణభారం నుంచి విముక్తి లభిస్తుందని ఆశించారు. చివరికి వారి ఆశలు అడియాసలే అయ్యాయి. చంద్రబాబు నిజస్వరూపం చూపించడంతో రైతన్నలు కుంగిపోయారు. ఐదేళ్లు మదన పడ్డారు. అప్పులకు చక్రవడ్డీలు చెల్లించారు. చాలా మంది రైతులు అప్పుల భారం తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. టీడీపీ హయాంలో ఒకే ఏడాది ఏపీలో 628 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారంటూ నాటి కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్ రాజ్యసభలోనే ప్రకటించారు. బాబు మోసపూరిత పాలనకు 2019లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధిచెప్పారు. అదే చంద్రబాబు మళ్లీ రైతులను ఉద్ధరిస్తానంటూ వ్యాఖ్యలు చేస్తుంటే 'నిన్ను నమ్మం బాబూ' అంటూ నినదిస్తున్నారు. చంద్రబాబు మోసపూరిత పాలనను రచ్చబండలపై చర్చిస్తున్నారు. ఉచిత హామీలిచ్చి మోసంచేసే టీడీపీ నాయకుడిని నమ్మితే నట్టేట మునిగిపోతామంటూ వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలో 90వేల మంది రైతులకు చెందిన రూ.114.06 కోట్లు మాఫీ చేయకుండా చంద్రబాబు ఎగ్గొట్టాడని గుర్తుచేసుకుంటున్నారు.

రైతన్నకు దన్నుగా జగనన్న

జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతన్నకు అండగా నిలిచారు. వ్యవసాయాన్ని పండగగా మార్చారు. ఊరూరా ఆర్‌బీకేలు ఏర్పాటుచేసి విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు సేవలను అక్కరకు తెచ్చారు. ఏటా వైఎస్సార్ రైతుభరోసా కింద రూ.13,500 పెట్టుబడి సాయం అందిస్తూ సాగును ప్రోత్సహించారు. పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద రైతు తరపున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేలా ఏర్పాట్లు చేశారు. విపత్తుల సమయంలో రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. నేడు పొరుగు రాష్ట్రాలు సైతం మన రాష్ట్రంలోని ఆర్‌బీకే వ్యవస్థలను అధ్యయనం చేస్తున్నాయంటే 58 నెలల కాలంలో జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో తెచ్చిన విప్లవాత్మక మార్పులే కారణం.

జగన్‌మోహన్‌రెడ్డికే ఓటేస్తా..


తన మనసులో మాటను వైఎస్సార్‌సీపీ నాయకులు ఎదుట వెల్లడిస్తున్న టీడీపీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాపా లక్ష్మణరావు

రాజాం/సంతకవిటి: నేను ఇంతవరకూ ఎన్నో పార్టీలు, ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశాను. ఎంతమంది ఒత్తిడిచేసినా ఇప్పటివరకూ తెలుగుదేశం పార్టీని వీడలేదు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి లాంటి మహాత్ముడి పాలనలో కూడా నా మనసు మారలేదు. కానీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా చేసిన పాలన నన్ను మంత్రముగ్ధున్ని చేసింది. పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందించారు. అందులోకి నాలాంటి కరడుకట్టిన టీడీపీ కార్యకర్తకు కూడా రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలు వచ్చాయి. నా విషయం పక్కన పెడితే.. అన్నెంపున్నెం తెలియక ఆ క్షణానికి ఎన్నికల్లో చొక్కాలు చించుకుని పరుగెత్తే ఎంతో మంది పేదవాళ్లు తరువాతి కాలంలో రాజకీయ నేతల కక్షసాధింపులో సంక్షేమ పథకాలు అందక అవస్థలు పడిన సందర్భాలు చూశాను. అటువంటి వారికి కూడా జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పార్టీలకు అతీతంగా న్యాయం జరిగింది. సంక్షేమ పథకాల లబ్ధి పొందిన ఏ ఒక్కరు ఫ్యాన్ గుర్తును కాదని ఇతర పార్టీలకు ఓటు వేయరు. నేను గ్రామ స్థాయిలో రాజకీయం జరిగే సమయంలో ఆలోచిస్తానేమో. ఇప్పుడు మాత్రం ఎంతమంది చెప్పినా నా మనస్సును గెలుచుకున్న జగన్‌మోహన్‌రెడ్డికే ఓటు వేస్తాను. ఈ దఫా ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డే రాజు. నాలాంటి చాలా మంది అభిప్రాయం ఇదే. మే 13న జరిగే ఎన్నికల్లో ఇది స్పష్టంగా కనిపిస్తుందంటూ సంతకవిటి మండలం సురవరం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాపా లక్ష్మణరావు తన మనసులోని భావనను వ్యక్తంచేశారు. గ్రామంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో తన వద్దకు ఓటు అడిగేందుకు వచ్చిన జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడుల ఎదుట తన మనసులో మాట చెప్పారు.

రాజేష్ నామినేషన్‌కు తరలిరండి


రాజాం : సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

- 24న నామినేషన్
- వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ నామినేషన్ ఈ నెల 24న రాజాంలో వేయనున్నారని, పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని దేవీ – శ్రీదేవీ కల్యాణ మండపంలో నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న విజయనగరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం బస్సు యాత్ర జరగనుందని, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రాజాంలో ఈ నెల 24న జరగనున్న రాజేష్ నామినేషన్ కార్యక్రమం కూడా విజయవంతం చేయాలన్నారు. 24న ఉదయం 10 గంటలకే రాజాం చేరుకోవాలని కోరారు. నామినేషన్‌కు వచ్చే వారితో మన విజయం ముందే ఖాయమనేది బయట ప్రపంచానికి తెలిసేలా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమానికి కార్యకర్తలు తరలిరావాలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, పార్టీ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, పార్టీ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, గురుగుబెల్లి స్వామినాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, కరణం సుదర్శనరావులు, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, యాలాల వెంకటేష్, నక్క వర్షిణిలు, జేసీఎస్ కన్వీనర్లు పాలవలస గోపి, కామోదుల శ్రీనివాసరావు, కింజరాపు సురేష్, రాగోలు రమేష్‌నాయుడు, కిమిడి ఉమామహేశ్వరరావులు, ఏఎంసీ మాజీచైర్మన్ సిరిపురపు కుమారస్వామినాయుడు, పెద్ద ఎత్తున పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు వడదెబ్బ

- రోడ్డు పక్కకు ఒరిగిపోయిన బస్సు
- తప్పిన పెనుప్రమాదం


రోడ్డుకు పక్కగా ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు


పీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న డ్రైవర్ ఆసిఫ్

భామిని: శ్రీకాకుళం డిపో పల్లె వెలుగు బస్సు భామిని మండలంలోని బాలేరు–దిమ్మిడిజోల గ్రామాల మధ్య ఏబీ రోడ్డు పక్కగా ఒరిగిపోయింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సు నడుపుతున్న డ్రైవర్ తీవ్ర వడదెబ్బకు గురై అపస్మారక స్థితికి చేరడంతో నడుస్తున్న బస్సు రోడ్డుపక్కకు ఒరిగిపోయింది. అయితే డ్రైవర్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. బత్తిలి నుంచి కొత్తూరు వెళ్తున్న బస్సు దిమ్మిడిజోల దాటిన క్రమంలో డ్రైవర్ ఆసిఫ్‌కు వడదెబ్బ తగిలి కళ్లు తిరుగుతుండంతో ప్రమాదాన్ని గుర్తించి బస్సులోని 18 మంది ప్రయాణికులను కిందికి దింపేశాడు. వెంటనే రోడ్డు పక్కకు బస్సు తీస్తుండగా డ్రైవర్ ఆసిఫ్ అపస్మారక స్థితికి చేరుకోవడంతో బస్సు అదుపు తప్పి తుప్పల్లోకి వెళ్లి ఒరిగిపోయింది. అపస్మారక స్థితిలో ఉన్న డ్రైవర్‌ను కిందికి దించి 108 అంబులెన్స్ రప్పించి భామిని పీహెచ్‌సీకి తరలించగా వైద్య సేవలు అందించడంతో ఆరోగ్యం కుదుట పడింది. బస్సులో నుంచి దించిన ప్రయాణికులను తరువాత వచ్చిన ఆర్టీసీ బస్సులో కండక్టర్ ఎక్కించారు.